# ఇంకొకవిధము

గోపీనాథుడును మలయగిరియు నెప్పుడు గలిసియే తిరుగుచుందురు. మలయగిరి కుడిచేయి గోపీనాథుని బుజమున కెడముగా నున్న నిముసము మనము చూడలేము. మలయగిరి గోపీనాథుని "ఏమండీ" యని పిలుచును. ఇతరులతో చెప్పునపుడు "వారు" అని ప్రశంసించును. గోపీనాథుడు మలయగిరిని "ఏమిరా?" యని పిలుచును. గోపీనాథునకు సుమారు ముప్పది యేండ్లు. మలయగిరి పదునైదేండ్ల వాడు.

వీ రిరువురకు దేహములుమాత్రనే రెండు. మలయగిరికి గోపీనాథుడు తల్లిదండ్రులకన్న మాననీయుడు, ప్రేమాస్పదుడు. మలయగిరి సుకుమారమైన మొగము పైని వెన్నెల కసుగందక ముందు గోపీనాథునకు ప్రళయము చూచుటయైన నిష్టమే. గోపీనాథుడు మలయగిరితో మాటలాడుచున్నప్పుడు ఆతని వదనము మలయగిరి మొగమున కెంతదూరముననో యుండదు. గోపీనాథుని చేతులకు పిన్నగాలికి కదలు మలయగిరి ముంగురుల సవరించుటయే పని.

సాయంసమయమందు బజారులోని గులాబి పూవులను గోపీనాథుడు మలయగిరి కురులయందు ముడుచును. అప్పుడిరువురు నొకరినొకరు చూచుకొని నవ్వుకొనుచుందురు. ఎవరితోనైన గోపీనాథుడు మాటలాడుచు పోవుచున్న మలయగిరి యతని మోచేతికి తనమోచేయి తగుల్చును.

ఒకొక్కప్పుడు మాటలాడుమనే తల్లిని బిల్లవలె మలయగిరి గోపీనాథుని యెదురుఱొమ్ముపై తన తలమోపును.

ఎప్పుడును తనమీద నొరిగి నిదురించు మలయగిరి కదలికవలననే గోపీనాథునకు మెలకువ. ఒలుచుచున్న నారింజపండు నే నొలిచెదనని గోపీనాథు డడిగినకొలది మలయ గిరి యియ్యక తానే యొలుచుకొనుచు నతని మొగముజూచి నవ్వుచుండును. గోపీనాథుడు బజారున నే వింతవస్తువు చూచి నను నది మలయగిరికి తెచ్చిపెట్టకున్న నతనికి నిద్దురపట్టదు. ఒకొక్కప్పుడు గోపీనాథునిపైన దేనికేని కోపమువచ్చి తన్ని నను గోపీనాథుడు పోనిమ్మని సంధికి చేయిచాచును. మలయ గిరి కన్నీళ్ళతో గవుగిలించుకొనును. అతడు పసివాడని గోపీ నాథున కెక్కడలేని ప్రేమ.

గోపీనాథుడు ప్రసిద్ధనటుడు. సంగీతము లేదుకాని యతని యభినయము నభినందించని విద్యాధికుడు లేడు. అతని పేరు చెప్పిన డబ్బు కురియును. నాటకరంగమున నతని ప్రతిభ యప్రతిమానము. స్వభావసిద్ధముగ నతడు నటకు డగుటఁ దక్కిన వానికేమిగాని, విద్యరానివాడైన యతని వాచకము ప్రశంసకందదు అతడెప్పుడు నాటక మాడినను ప్రధాన పాత్ర యతనిది. తక్కినవారి నెవరినో కూడగట్టి తక్కిరి బిక్కిరిగా నాటక మాడును. నాటకము రక్తికట్టని రాత్రి లేదు.

ఈసారి "పారిజాతాపహరణ" మాడు తలం పతనికి జనించినది. పాత్ర లందరికిఁ బంచినాడు. మలయగిరి సత్య

భామ వేయునట్లు. మఱునాటినుండి మలయగిరిని తయారు చేయ మొదలు పెట్టినాడు. పాప మతడు నోట మాటc బట్టలేదు. ఆయుస్సు చాలదు. ఎన్నివిధములనో ప్రయత్న మైనది, నాటకారంభ మైనది. నిన్నటినుండియు గోపీనాథునకు దిగులే. సత్యభామకుc దగినవాడు దొరకలేదు. మలయగిరి పాడుచేయును.

నాటక మైపోయినది. జనులందఱు గుంపులు గుంపు లుగా నిండ్లకేగుచున్నారు. ఎవ్వరినోట చూచినను "కృష్ణ వాడెవరు? ఆహాహా! ఎంతబాగున్నది! ఆ సౌభాగ్యము, ఆ స్వభావానురక్తి, ఆ మధురిమ, ఆ యమాయికత్వము. "ఇంత చిన్నవయసులో నింత నటు డెట్లయినాడు. భార్యా భర్తల యనురాగమువలె నున్నదే వారి నాటకము" అను మాటయే.